# ముంజెలు

— సదానంద్ శారద

వెన్నెల.. పొట్ల పూవుల్లాంటి వెన్నెల.. ఈ వెన్నెలను చూస్తే మా అమ్మమ్మగారి ఊరు గుర్తుకొస్తుందోయ్ మోహన్.. ముంజలు గుర్తుకొస్తాయి.. ఊహు.. ఒకసారి అమ్మమ్మగారి వూరు వెళ్ళి రావాలి అనిపిస్తున్నది.. ఈ మాట చాలాసార్లు అన్నావ్.. కాలేజీలో చేరినప్పట్నించి వింటున్నా.. రేపు సెలవేకదా– వెళ్ళి రాకూడదూ? వెళ్తాను.. ఈసారి ఎట్లైనా వెళ్తాను.. వెళ్తే ముంజలు తెస్తావా? ఓయస్.. అలాగే.

ఎక్కడ దిగాలి బాబూ?.. కంగారు పడకు... ఇంకే స్టేజి రాలేదులే.. ఆలోచనల్లో వున్నావు... మరిచిపోతావని అడిగా.. నల్లబెల్లి.. నల్లబెల్లా? ఆ అయితే వచ్చే ఊరు అదే..అడ్డబాట దగ్గరే ఆగుతున్నదా బస్సు? లేలే.. ఇప్పుడు ఊళ్లెకు పోతాందిగాదు.. అవును.. రైస్‌మిల్లు దాకా వెళ్తున్నది. శంకరయ్య వడ్లగిర్ని.. టకటక.. టక.. వెడల్పాటి నవారు బెల్టుతో తిరిగే చక్రాలు.. శంకరయ్య గిర్ని కాదు.. పెద్ద రైస్ మిల్ పడింది. ఊళ్లో ఒక్క వడ్ల గింజ నిలుస్తున్నదా!! బస్సు నిలిచింది.. దిగుండ్లి.. దిగుండ్లి.. నల్లబెల్లి.. దిగుండ్లి.. అయ్యో!... చిల్లరియ్యవా కండక్టరూ? కల్లెడల కదా దిగేది.. ఇస్తీయ్.. మెల్లంగా.. జెర మెల్లంగ దిగుండ్లి.. కాళ్ళు తొక్కబట్టిరి.. తలల్ని కూడా తొక్కి పోయేటోళ్లున్నారు.. ఎందుకు లేరూ గట్ల తొక్కే డిల్లీదాకా పోతున్నరు గదా.. కొంచెం చుట్ట బంద్ చేస్తవా? సిగలెట్ ఐతె పర్లేదా? అదీ వొద్దు.. ఎట్లసారూ! తాగకపోతే సర్కార్కు ఆమ్‌దాని ఎట్ల వొస్తది? దిగిండ్లా!.. గంత జెల్దిన దిగుతరా! దిగుండ్లి.. దిగుండ్లి.. దిగుతున్నావా బాబూ? ఆ వస్తానండి.. దిగిండ్లా.. రైట్ రైట్..

ఊరు.. గుండెలో తీయని జ్ఞాపకాల్ని ఊదే వేణువు.. ఒక చల్లని గాలి తెమ్మెర.. తియ్యని తాటి ముంజ! అమ్మ ఒడి.. ఆత్మీయుల పలకరింపు..

ఎవలింటికి నాయనా? ఎవరింటికని చెప్పను? అమ్మమ్మలేదు.. అమ్మమ్మ గారి ఇల్లు లేదు.. మేనమామ పల్లెలోని పొలం, ఇల్లు అమ్మేసి పట్నంలో సెటిలైపోయాడు. బంధువులున్నారు.. పేర్లు గుర్తుకు రావడం లేదు.. గుర్తుకు వచ్చే ఒకే ఒక పేరు కళ.. చంద్రకళ! వరుసకు మరదలవుతుంది. నా కిష్టమని తాటిమీది నుంచి లేలేత ముంజలు కోయించుకొని తెచ్చేది!..

"రాములన్నా.. రాములన్నా.. తాళ్లెక్క పోతానవా?"..

".. ఎందుకు సెల్లె?"

"పేట నుంచి మా బావొచ్చాడు"

"శేకరయ్య వొచ్చిండా?.."

"ఆ.."

"అయితే ముంజలు తెమ్మంటవ్.."

"దోరదోరయి.. ముదరువి తెస్తే చూడు.."

"తేను సెల్లె.. దోర ముంజలున్న తాటికాయలు తెస్త.. నువ్వే బావకు వొలిచి పెడ్తువు.."

"సరే.. మా మంచి రాములన్న.."

"బావేడి సెల్లె? దిష్టి తగుల్తదా.. బయటికి రానియ్యవు!"

"నాయినమ్మ ఇంట్లో వున్నాడు కదా.."

"అట్లనా.. అప్పటికి చూస్త తీయ్.. అడిగిన్నని చెప్పే."

ఎవలింటికో చెప్పకపోతివి కొడుకా.. ఎవరింటికి? చంద్రకళ తండ్రి పేరు... దేవయ్య.. దేవయ్య మావ.. దేవయ్య ఇంటికి.. ఏ దేవయ్య? డోలి దేవయ్యా? ఆ ఆ ... గిట్లనే సక్కంగబోయి ఎడమకు తిరుగు.. తెలిసిన దారే..

దారి మరవలేదు...

గా కుమ్మరి వాము దాటంగనేవున్నయి డోలోల్ల ఇండ్లు... అవునవును...

"బావా..,"

"ఉ..."

"ఒక్కసారి నోరు తెరువు"

"ఎందుకు?..."

"అబ్బ! తెరవమంటే..."

"ముంజలు... ఆహాహా... నా కిష్టమైన ముంజలు..."

"ఊ.. నోరు తెరువు మరి..."

"చాలా బాగున్నాయి కళా.. ముంజ నిండి తీయని నీళ్లు... ఈ ముంజ నిండా చల్లని తీయని నీళ్లే!...

"ఇప్పుడే చెట్టు మీది నుంచి నీ కోసం కోసినవి గవుండ్ల రాములన్న తెచ్చాడు..."

"అందులో నీ చేత్తో ఇస్తున్నావు కదా... మరీ బాగున్నాయి..."

"పో బావా.. నన్ను మెచ్చుకోవాలని అంటున్నావు కదూ?..."

"నా కోసం ఎంత శ్రమపడి.. తీయని ముంజలు తెచ్చావు కళా..."

"ఇందులో శ్రమేం వున్నది బావా! ఇదో పాయసమా! పరమాన్నమా!!"

"అమృతకంటే విలువైనవి.. ఇష్టమైనవి కళా.. ముంజలు..."

అమ్మమ్మగారి వాడ... అప్పటి వాడేనా ఇది! మనుషులు చిక్కిపోయారు..! వాడ చిక్కిపోయింది! సగం ఇండ్లు శిధిలావస్థలో వున్నాయి...!!కలదోసిన బొమ్మరిల్లలా వున్నాయి. ఎవలు బాబూ? నేను.. నేను... శేఖర్‌ను మావా... శేఖరా!... ఏ శేఖరు?.. డోలి శాంతమ్మ మనవణ్ణి.. ఓసోస్.. శాంతమ్మ పెద్దమ్మ... మనవనివా!! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు మా మీన దయకలిగింది అల్లుడా! రా నాయినా రా.. మీ అత్త ఇప్పుడే అవుతలి వాడకు పోయింది.. ఇట్లగీ నులుక మంచం మీద కూసో బిడ్డా...

అందరు బాగున్నరా.. మా సెల్లె బాగున్నదా... బావ బాగున్నడా.. ఆ మీరంతా బాగున్నారా మావా.. ఏఓ చావకుంట బతుకకుంట గిట్లున్నం బిడ్డా! మళ్ళ మిమ్ముల చూస్తే అనుకోలే!...

పరిసరాలు చాలా మారిపోయాయి. చెదలు పట్టిన అందమైన చిత్రపటంలా వుంది ఊరు!.. దేవయ్య మావ ఇల్లు సగం కూలి.. సగం నిలబడి.. ఇంటి చుట్టూ పాదులతో కలకళలాడిన పెరడు ఏది?... యువరాణిలా ఇండిమీదికి ఎక్కి కూచునే ఆనిగెపు తీగ ఏది? ఇక్కడ పొట్లపాదు వుండాలి కదా మావ.. నీ గ్యాపకం వున్నాది కొడుకా!! ఆ పక్కన పసుపుపచ్చని పూలు పూసే బీరపాదు!... ముద్దబంతి.. సీత జడ.. రుద్రాక్ష.. గోరంట.. ఆ మొక్కల్లో ఒక్కటీ లేదు. గా సెట్లన్నీ నీకు యాదికున్నాయి కొడుకా.. మేమన్న మర్సినంగని నువ్వుగా సెట్లను మరువలె... సెట్లన్నీ పాయె.. పాదులననీ పాయె కాదు బిడ్డా... నీళ్లేయి? మావే



నీళ్లు దొరుకుడు కష్టం.. ఇక ఆటినేం పెంచుతం.. ఎన్కట చెరువు నిండ నీళ్లుండేయి.. బావులు నిండేయి.. ఇప్పుడు చెర్లకు కాలువలు బందాయె.. చెరువు ఎండిపోతాండె.. శారెడు నీళ్లుంటె చెరువు కింద భూములే తడిసె! కరెంట్ బావులున్న మారాజులది రాజ్జెం కొడుకా.. ఆళ్లు పంట మీన పంట దీసి పైకి పోబట్టిరి. మేంగిట్ల రోజు రోజుకు అడుగంటిబడ్తిమి. అయ్యో! బూట్లు ఇప్పకపోతివి బిడ్డా... కాళ్లు కడుక్కుందువు.. గోలెంల నీళ్లు దుతయా!...

కావ్... కావ్.. గోలెం మీది కాకి అరుస్తున్నది...

"బావా బావా... ఇవ్వాళ పొద్దున కావ్ కావ్ అని ఒకటే అరిచింది కాకి... మా బావొస్తాడు అనుకున్నా... వొచ్చేశావ్..."

"ఆ కాకే.. మా డాబా మీద వాలి కావ్‌కావ్‌మని అరిచింది.. నువ్వు పిలుస్తున్నావని వచ్చేశా.."

"మాటలు బాగా నేర్చాడే బావ! పరీక్షలెట్లా రాశాడో?.."

"బాగానే రాశాను గాని నీ చదువేమైంది?..."

"మాకు చదువులంటె మాటలా బావా.. మా పనులకు చదువుకు కుదురుతుందా? కుదిరినప్పుడు చదువుకుంటాలే.. నా చదువు నీ చదువు నువ్వు చదువుతున్నావు కదా చాలదా?.."

"నేను తింటే... నువ్వు తిన్నట్టేనా?..."

"అయినా.. నాకు అక్షరాలు వచ్చు కదా.. ఈ వాడలో అక్షరాలు వచ్చిన ఏకైక అమ్మాయిని నేనే తెలుసా?..."

"గొప్పే.. నువ్వు చదువుకోవాలి.. దేవయ్య మావకు చెబుతానుండు.."

"[illegible] ముందు కాళ్ళు [illegible] పెట్టు.. బూట్లు విప్పతా.. అది.. అట్లా.. ఏది పాంటు పైకెత్తు.. కాళ్లు కడుగుతా..."

"[illegible]క్కు ఎట్లాగే.."

"నేను కడుగుతా కదా బావా.. వంగితే నీ డ్రాఫ్ [illegible]..."

మావా.. చంద్రకళేది? ఎవలు? కళమ్మా! ఆ కళమ్మకు పెండ్లాయె.. అత్తగారింటికి పాయె.. నీకు తెల్వదా బిడ్డా?...

పెళపెళ తాటికాయలు తలమీద పడుతున్నాయి. కళ్లకు చీకట్లు.. మెదడు మొద్దుబారిపోతున్నది. చంద్రకళకు పెళ్లయిందా! కాకపోతే ఇంత వయసు వచ్చేదాకా పల్లెలో ఓ అమ్మాయి పెళ్లికాకుంటా వుంటుందా బస్తీ బాబూ? నీకింకా సేవలు చేస్తుంది అనుకున్నావా?

పేటకే ఇచ్చినంగాదు కొడుకా.. కళమ్మ పెండ్లయి మూడేండ్లు దాటె.. మీ పేటల్నే వుంటరు గదా.. నీ కెవ్వడన్నా కనబడలేదా? అల్లుడు బట్టల మిల్లుల పని దొర్కుతది అన్నడు.. దొర్కలే...గా మిల్లు మూడ పడుతాందట.. రిచ్చ తొక్కుతడు కాని ... తాగుబోతోడు నాయినా.. ఏం జేయను? దాని రాత గట్లయిపోయింది. బిడ్డకో కొడుకు...గా సంటోన్ని ఏసుకొని ఆ పని ఈ పని చేసుకుంట సంసారం ఎల్లదీస్తాంది...

అదేంది బిడ్డా.. బూట్లిప్పవు!!

ఎవలు?.. గీ దొరెవలు?.. వొచ్చినవా దుర్గా.. మనింటికి ఎవలొచ్చిండ్లో సూసినవా?.. శాంతమ్మ పెద్దమ్మ మనవడు.. భారతమ్మ కొడుకు లేడూ... ఆ ఆ శేకరయ్యా? శేఖరయ్యే... నువ్వా శేకరి!! బాగున్నవా నాయినా. .. ఎంత పెద్దోనివి అయినవు!... నా బంగారు కొండే!... గిన్నాళ్లకు యాదికొచ్చినాం బిడ్డా... అవ్వ బాగున్నదా... నాయిన బాగున్నడా... బాగున్నారు అత్తమ్మా... ఆరేండ్లయిందా... ఏడేండ్లయిందా కొడుకా నువ్వు ఇటొచ్చి... శాంతమ్మత్త పోయింది... మీరు దూరమైతిరి... ఇయ్యాల దయదలసి నువ్వొచ్చినవ్.. అదే పదివేలు నాయినా...

ఎవలు దేవన్నా?.. ఎవలు దుర్గాక్కా?... శాంతమ్మత్త మనవడుగాదు రాజమ్మా.. భారతమ్మ వొదినె కొడుకు. .. భారతమ్మ కొడుకా!! అబ్బో పెద్ద పెద్దోడయిండు! పెళ్లయిందా కొడుకా? పిల్లలా?.. లేదత్తమ్మా.. ఈ సంవత్సరంతో నా ఇంజనీరింగ్ చదువు పూర్తవుతుంది...

లే.. లేచి కాళ్లు కడుక్కో నాయినా...

ఇక్కడో బొడ్డు మల్లె చెట్టుండేది... ఆ చెట్టు కింద నీడలో చాపేసి కూర్చోబెట్టి..

"బావా బావా.. బొడ్డెమ్మకు ఎన్ని రంగుల పూలు తెచ్చావో చూడు...."

"బావా బావా మనిద్దరం కూర్చొని బతుకమ్మను పేరుద్దామా!..." అరుగుమీద గంపెడు గంపెడు తంగెడిపూలు! ......

"రాత్రి నీ కోలాటం ఆట, పాట - చాలా బాగున్నాయి కళా.."

మళ్లీ నువ్వు ఆడుతూ పాడుతుంటే చూడాలనిపిస్తున్నది... కళా...! మళ్లీ నీతో సేవలు చేయించుకోవాలి కళా... మళ్లీ నిన్ను మరచిపోవాలి కళా... ఎంత ఆశ శేఖరం!.....

కాళ్లు కడుక్కున్నవా నాయినా.. గీ మంచినీళ్లు తాగు.. ఉప్పనీళ్లు బిడ్డా... గుట గుట రొండు బుక్కలు తాగు.. పొద్దున్నే నీ కోసం చెరువు చెలిమల మంచినీళ్లు తెచ్చే చంద్రకళేది!! నీళ్లు ఊరే చెలిమలు ఇప్పుడున్నాయా?... చెలిమలైన కళ్లున్నాయి!

ఏమనుకోకు బిడ్డా... జెర ఎట్లనన్నీ రొండు ముద్దలు తిను.. ఏం జేయను కొడుకా... ఓ కూర దొర్కుతదా... నార దొర్కుతదా... ఈడ వండిన వంటలు ఈడనే దొర్కకుంట అయింది!.. పవ్వశారు చేసిన మీ మావ పెరుగుకు తిరిగి వొచ్చిండు. పెరుగులేదు. నల్ల ముక్క లేదు.. గట్లయింది బిడ్డా మా బతుకు!...

"నీకు గుత్తి వంకాయ కూరా, చింత చిగురా.. ఏది ఇష్టం భావా?.."

"నువ్వేది పెట్టినా ఇష్టమేనోయ్..."

"చెప్పు బావా..."

"నిజం...."

"అయితే దోర దోర చింత చిగురు వండి తెస్తానేం.. గడ్డపెరుగు.. చింత చిగురు కూర.."

"అబ్బ! నోరూరుతున్నదోయ్..."

అట్లా ఊళ్లోకి వెళ్ళొస్తా మావయ్యా.. నాలు గ్గంటల బస్సుకు వెళ్తాను.. గింజెప్పన్నే పోతవా బిడ్డా... అట్లొచ్చి ఇట్ల పోతాంటివి! వెళ్లాలి మావయ్యా...

ఊరు!.. చీకి పడేసిన మావిడి పిక్కలావుంది ఊరు!! విశాలమైన ఆ వాకిళ్లు లేవు... ఊరు బందుకు అందమైన చిన్న చిన్న తోటలు లేవు.. బాటకిరువైపులా.. గంధం చల్లినట్టు.. ఎర్రెర్రని దుబ్బపడిన ఆకులు... కొమ్మలతో ఎత్తెత్తు చెట్లు లేవు... నరికేశారు!... పట్టణాల్లో, నగరాల్లో చెట్లు పెరిగి.. పల్లెల్లో తగ్గిపోతున్నాయి!!...

వెళ్తే ముంజలు తెస్తావా? ఓయస్... అలాగే... మోహన్ ముంజలు అడిగాడే!... ముంజలా!!... ఎవ్వటిలెక్క ఊళ్లె ముంజలు దొరుకుతానాయి కొడుకా! వనం నుంచే... మాయమై పోతాండె.. మాకు ముంజలెక్కడియి... మాకు నవ్వులెక్కడియి నాయనా!!...

చంద్రకళకు పెళ్లికాకుండా వుంటే చేసుకుందును.. చదువు రాకున్నా.. ప్రేమించే వాణ్ణీ... చదివించే వాణ్ణీ... అంతా రాష్.. అదంతా హిపోక్రసి.. ఆ అమ్మాయితో అన్ని సేవలు చేయించుకున్నావ్... ప్రేమాభిషేకం చేయించుకున్నావ్... ఆ దోర మనసుతో ఆడుకున్నావ్.. ఆశలు రేపావ్... అన్ని సంవత్సరాలు ఊరి మొహం చూళ్లేదు.. ఒక్క ఉత్తరం ముక్క రాశావా? చంద్రకళను చేసుకుంటా అని పెద్దలతో ఒక్కమాట అన్నావా? ఆ అమ్మాయి ఇంకా ఎదురు చూస్తుందని ఎట్లా అనుకున్నావ్?....

మీ ఫస్ట్ రాంక్ హోల్డర్లకు... రెసిడెన్షియల్ చదువుల వాళ్లకి మెదడు పెరిగి హృదాయలు తరుగుతున్నాయి. రెసిడెన్షియల్ విద్యార్థులు... కోళ్ల ఫాం పక్షులు!! పౌల్ట్రీ ఫాం బర్డ్స్!!... రేపు హృదయాల్లేని పనులు చేసి మెదళ్లతో జనాన్ని ఇట్లాగే దోచుకుంటారు!!...

దిగండి సార్... సిటీకి వొచ్చేసినం.. బస్సాగి ఐదు నిమిషాలయింది.. అరరే.. దిగుతున్నా.. వన్‌మినిట్...

హమ్మయ్య!... అప్పట్నించి ఒక్కటే ఉక్కపోత... అది ఉక్కపోత కాదోయ్... అంతరాత్మ దాడి!!

గేటు పక్కనే ఏమిటవి? ముంజలు... గంప నిండా గుండెల్ని కుప్పపోసినట్టు... గుండె ఆకారం ముంజలు!! ఎంతమ్మా? రూపాయికి ఒక్క టిసార్... ఎన్ని కావాలి? ఎన్ని కావాలంటె అన్ని ముంజలు!! పది ఇవ్వు... ఇదిగో పది రూపాయలు.. ఎవరామె? ఎక్కడో చూశానే.. మాసిన తల.. గుంటలు పడిన కళ్లు... ఎవరామె? ఎవరు?? గుండెల్లాంటి ముంజల్ని ఆకులో పెట్టి అమ్ముతూ... చంద్రకళ!!

ఒకసారి రాజ్యసభలో ప్రశ్నల సమయంలో తొలిప్రశ్నను సీతారమానంద్ అడిగింది. రెండవ ప్రశ్నను సావిత్రీదేవి ప్రశ్నించింది. మూడవ ప్రశ్నను పార్వతీదేవి అడిగింది. అప్పట్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు వైస్‌ప్రెసిడెంట్‌గా వున్నారు. ఆయనే ఆసభకు అధ్యక్షులు. ముగ్గురు మహిళలు ప్రశ్నించిన పిమ్మట ఆయన నవ్వుతూ అన్నారు..."ఈరోజు మనతోపాటు సీతా, సావిత్రీ, పార్వతి వున్నారు. ఇది చాలా సంతోషం కలిగించే విషయం" అన్నారు సభలోనేవున్న హాస్యప్రియుడు మహావీర్‌త్యాగి తన సీట్లోనుంచి లేవచ, "ఒక్క సీతా, సావిత్రి పార్వతులే కాదు రాధాకృష్ణ కూడా స్వయంగా వారితో కలిసి మనతోపాటు వున్నారు" అన్నాడు. అది విని సభంతా నవ్వులతో మార్మోగిపోయింది రాధాకృష్ణచిరునవ్వులు నవ్వుతూ కూర్చున్నారు.

కొడిమెల శ్రీరామమూర్తి.